అంబరాన్నంటిన సంక్రాంతి సంబురం



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, సయ్యద్ అష్మద్ భక్తియార్ తదితరులు

- ముషీరాబాద్‌లో నేత్రపర్వంగా ముగ్గులు వేసిన మహిళలు
- విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: సంక్రాంతి సంబరాలు శనివారం ముషీరాబాద్‌లో ఘనంగా జరిగాయి. భరత్‌నగర్‌లోని రేడియెంట్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ముగ్గులు వేయడంలో పోటీపడ్డారు. భోగి మంటలు, రంగురంగుల హరివిల్లులు, పండగ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముగ్గులను పరిశీలించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భావితరాలకు మన సాంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివముదిరాజ్, ఎం.డి.మోహిన్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, బల్లా ప్రశాంత్, పూస గోరఖ్‌నాథ్, రేడియెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అన్వర్ ఉల్లా, ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఉపాధ్యాయులు మంజుశ్రీ, అనీఫా, ఇర్ఫానా, శాంతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పతంగుల పంపిణీ

ముషీరాబాద్: సంక్రాంతి పండగ సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా వైభవంగా నిర్వహించాలని బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహా అన్నారు. శనివారం భోలక్‌పూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని రంగానగర్‌లో పిల్లలకు పతంగులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ... పతంగులు ఎగురవేసే క్రమంలో చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భవనాలపై, విద్యుత్ తీగల వద్ద ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించి పండగను ఘనంగా జరుపుకోవాలన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకాంత్, కృష్ణ, నేతలు ప్రవీణ్, బాబురావు, జాహెద్ అలీ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకగా నిలుస్తయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో ముగ్గులతో పాటు గొబ్బెమ్మలు పెట్టడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. శనివారం పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలకు పోటీలు నిర్వహించడం వారిలో ఐక్యతను, ఆప్యాయతలను పెంపొందిస్తాయని తెలిపారు. మాతా వకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ నీలా శ్రీధర్, కోశాధికారి జైహింద్, శ్రీనివాసచారి, ఎస్.ఎ స్.కె.ప్రసాద్, ఐపీ గవర్నర్ చక్రపాణి, లింగప్రకాష్, బీజేపీ కార్పొరేటర్ అమృత, క్లబ్ సలహాదారులు ఎ.రామలింగేశ్వర్ రావు, వి.నాగభూషణం, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులతో వ్యాయామం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంటి ముందర ముగ్గులు వేయడం ద్వారా చక్కటి వ్యాయామం కలుగుతుందని న్యూ ఎరా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం న్యూ ఎరా కళాశాల, సెయింట్ ఆడమ్స్ పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో పోటీతత్వంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించడానికి ముగ్గుల పోటీలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో ఆటపాటలు కూడా అంతే అవసరమని దీన్ని వల్ల వారిలో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.



ముషీరాబాద్‌లో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



పద్మ కాలనీలో విజేతలకు బహుమతులిస్తున్న ఎమ్మెల్యే



పతంగులను పంపిణీ చేస్తున్న ముఠా జైసింహ...

పార్కుల అభివృద్ధికి కృషి

గాంధీనగర్ కార్పొరేటర్ పావని



బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సురభి పార్కు వద్ద నూతన బోర్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు ఏ.వినయ్‌కుమార్, సత్తిరెడ్డి, శ్రీకాంత్, సురేందర్, నరసింహ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలో కార్పొరేటర్ రవిచారి పాదయాత్ర



కార్పొరేటర్ రవిచారికి వినతిపత్రం సమర్పిస్తున్న స్థానికులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీలో శనివారం రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు, బోర్ వెల్ తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎల్ఐజీ బస్తీ అధ్యక్షుడు సిరిగిరి కిరణ్, వాటర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం చిక్కడపల్లిలో జరిగింది. బ్యాంకు తెలంగాణ జోనల్ మేనేజర్ కె.భాస్కర్‌రావు ముఖ్య అతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పురస్కారాల ప్రదానం



పురస్కారాలను అందుకున్న ప్రముఖులు

అంబర్‌పేట్: ఫాస్, హిట్ సంస్థల ఆధ్వర్యంలో ఆయా రంగాల ప్రముఖులకు సంక్రాంతి పురస్కారాలను ప్రదానం చేశారు. శనివారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. సినీ రచయిత, దర్శకుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, రైల్వే కార్మిక నేత యుగంధర్ పట్నాయక్‌లకు పురస్కారాలను అందజేశారు. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల పూర్వ కో ఆర్డినేటర్ ఎంఎస్ ప్రసాద్, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. నిర్వాహకులు డాక్టర్ కె.ధర్మారావు, ఐఓసీఎల్ మాజీ జీఎం సూరపనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా సంక్రాంతి ముగ్గులు



బహుమతులిస్తున్న గౌతమ్‌రావు

అంబర్‌పేట్: సంక్రాంతి ముగ్గులు మహిళల సృజనాత్మకతకు అద్దం పడుతాయని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు తెలిపారు. శనివారం పటేల్‌నగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, నాయకులు శ్రవణ్, హారతి, జ్యోతి, శిరీషా, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన వీక్షణకు ఏర్పాట్లు



రాముల వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని తమ కాలనీలో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. శనివారం అయోధ్య రాముని పూజిత అక్షింతలను కాలనీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజించి కాలనీ వాసులకు పంపిణీ చేశారు. కరపత్రాలు అందించి శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఈ నెల 22న ప్రత్యేక్షంగా వీక్షించి దీపాలు వెలిగించాలని ఆయన కాలనీవాసులను కోరారు. కాలనీల్లో ఉన్న ఆలయాల్లో సైతం ప్రత్యేక స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అసోసియేషన్ నేతలు రమేశ్‌గౌడ్, ప్రసన్న ఆంజనేయులు, ఎ.రామగౌడ్, బి.మధుసూదన్‌చారి, వినోద్‌కుమార్, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో రామయ్య అక్షింతల వితరణ



అక్షింతలను పంపిణీ చేస్తున్న మయూరి సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

నల్లకుంట: ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, మయూరి సాంస్కృతిక సమాఖ్య సంయుక్తాధ్వర్యంలో శనివారం నల్లకుంట మయూరి లేన్‌లో ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఈ నెల 22న యూపీలో అయోధ్య రామయ్య వేడుకలు ఘనంగా జరుగుతాయని, ఆ రోజు అన్ని రామాలయాల్లోనూ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తారని చెప్పారు. అయోధ్యలో జరిగే రాములోరి ప్రాణ ప్రతిష్ఠ, కల్యాణోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా నేత్రపర్వంగా తిలకించవచ్చునని రామ భక్తులకు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీ ప్రతినిధి అఖిల్, మయూరి సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు ప్రమోద్‌కుమార్, ఎస్.రామ్‌జగదీశ్ ముదిరాజ్, కైలాశ్ నాథ్, రామ్మోహన్, చిరంజీవి, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి

చిక్కడపల్లి: కాలేజ్ ఆఫ్ ఆస్ట్రాలజీ ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మీ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భవాని తన పంచపదుల స్తోత్ర మహిహారంలో అమ్మవారి నామాల విశిష్టతను విపులంగా వివరించారన్నారు. రచయిత్రిని ఘనంగా సన్మానించారు. తొలుత నిర్వహించిన కవిసమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని జీవితలను చదివారు. కార్యక్రమంలో ఎస్.కిరణ్మయి, విఠల్, బాలసుబ్రహ్మణ్యంశర్మ, శ్రీసుధా, రాధా, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామికి ఆభరణాల అలంకరణ



పూజలు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అంజిరెడ్డి

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లోని శ్రీ బ్రాహ్మరాంభా మల్లికార్జున స్వామి(మల్లన్న) జాతర మహోత్సవాలలో భాగంగా శనివారం మల్లన్న స్వామిని వివిధ రకాల ఆభరణాలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున హజరై స్వామి వారిని దర్శించుకోని పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హజరైన ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిల, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, రామకృష్ణ, మాజీ ఈవో రఘు, జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనదారులపై కేసులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిపై ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ శిశిపాల్‌రెడ్డి శనివారం కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నూతన నంబర్ ప్లేట్ పెట్టించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ... వాహనాదారులు సరైన నంబర్ ప్లేట్ వేసుకుని వాహనాలను నడపాలని సూచించారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలి

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. విద్యా పటిష్టానికై పరిరక్షణ కమిటీ కృషి చేస్తుందన్నారు. సామాజిక, ఆర్థిక, అసమానతలను పోగొట్టడంలో విద్య శక్తివంతమైన ఆయుధం అని ఇలాంటి విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దు అని సూచించారు. రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందిస్తామని గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కేటాయింపులు గణనీయంగా తగ్గించడం వల్ల పాఠశాలల్లో, కళాశాలల్లో మౌలిక వసతులు కనుమరుగైయ్యాయని విమర్శించారు. కనీసం మరుగుదొడ్లను కూడా అభివృద్ధి చేయలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మౌలిక వసతులు కల్పిస్తామని తీసుకొచ్చిన మన ఊరు మన బడి పథకం కోసం కేటాయించామన్న రూ. 7298 కోట్లలో రూ. 440 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలన్నిటిలో తక్షణమే విద్యా వాలెంటర్లను, స్కావెంజర్స్‌ను నియమించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థులందరికి ఉదయం టిఫిన్‌తోపాటు సాయంత్రం అరటి పండ్లు, పాలు వంటివి ఇచ్చి హోమ్ వర్క్ స్కూల్‌లోనే చేయించిన తరువాత పిల్లలను ఇంటికి పంపాలన్నారు. మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఆయన సూచించారు. పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.చక్రధర్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, పీవైఎల్ అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ అధ్యక్షుడు పి.రామకృష్ణా, ఎం.పరశురామ్, పి.మహేష్, ఎం.ఎస్.కృష్ణప్ప తదితరులు ప్రసంగించారు.

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త ఆందోళన



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ... దేశంలో కార్మికవర్గ పరిస్థితులు రోజురోజుకై దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ఆకలి, ఉపాధి, నిరుద్యోగం, దారిద్ర్యం, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అంటూ నిరసన



నిరసన చేస్తున్న ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు

హిమాయత్‌నగర్: ప్రధాని నరేంద్రమోడీపై మాల్దీవుల మంత్రుల అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలో పలు ట్రావెల్ ఏజెన్సీలు మాల్దీవుల ప్యాకేజీలను రద్దు చేస్తూ బాయ్‌కాట్ మాల్దీవ్స్ అంటూ తమ నిరసన వ్యక్తం చేస్తున్నాయి. అందులో బాగంగా హిమాయత్‌నగర్‌లోని గగన్ విహారి టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ కార్యాలయంలో శనివారం 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' పేరుతో తమ నిరసన వ్యక్తం చేసింది. అంతేకాక ఇప్పటికే మాల్దీవ్స్ పర్యాటక సంస్థలతో తాము రూపొందించుకున్న పలు ప్యాకేజీలను సైతం రద్దు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మాల్దీవ్స్ డొమెస్టిక్ మేనేజ్మెంట్ కంపెనీలతో పాటు, అక్కడి ప్రముఖ 3 స్టార్, 5 స్టార్ హోటళ్లలోని తమ బుక్కింగ్స్ కాన్సిల్ చేసుకున్నట్లు సంస్థ ఫౌండర్ చైర్మన్ అజయ్‌కుమార్ అన్నల్‌దాస్ తెలిపారు. విదేశీ విహారయాత్రలకు వెళ్లాలనుకుంటున్న కస్టమర్లకు 'స్వాభిమాన్ భారత్' పేరిట మరింత డిస్కౌంట్‌తో లక్షద్వీప్ టూర్ ప్యాకేజీలను అందించనున్నట్లు ప్రకటించారు. తమలానే మరిన్ని ట్రావెల్ కంపెనీలు కూడా మాల్దీవ్స్ మంత్రులకు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని, అలానే తమ కస్టమర్లకు మన దేశీయ విహారయాత్రా ప్రదేశాలపైనా, అన్‌కవర్డ్ ఇండియన్‌టూరిస్ట్ ప్లేస్‌లపై తగిన అవగాహన కల్పిస్తూ, దేశ అభివద్ధిలో పాలుపంచుకోవాలని వారు కోరారు.

స్వాభిమాన్ భారత్ పేరుతో దేశీయ టూరిజంపై అవగాహన పెంచాలి

పద్మశాలీ మేళా కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్



చిక్కడపల్లి: తెలంగాణ పద్మశాలీ మేళా కమిటీ 2024 పద్మశాలి మేళా కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమనాతిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చిప్ప అనంతరాములు, ప్రధాన కార్యదర్శిగా పాచికంటి నాగమూర్తి, సంయుక్త కార్యదర్శిగా పరికిపండ్ల సుదర్శన్, కోశాధికారిగా చింతకింది జానయ్య, చీఫ్ అడ్వైజర్‌గా ఎస్.ఎస్.జయరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భీమనాతిని శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎన్నికైన వారికి ఈ నెల 26న ఇందిరాపార్క్‌లో పద్మశాళ మేళా 2024 కార్యక్రమాన్ని పద్మశాళీ కుల బాంధవులు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వీరభద్రయ్య కుటుంబానికి 'మనం సైతం' చేయూత



బంజారాహిల్స్: సినీనటుడు, మనంసైతం ఫౌండేషన్ నిర్వాహకులు కాదంబరి కిరణ్ మరోసారి దాతృత్వం చాటుకున్నారు. ప్రమాదానికి గురై ఆందోళనకరమైన పరిస్థితుల్లో హాస్పటల్‌లో చేరిన సినీ, టీవీ నటుడు డి.వీరభద్రయ్యకు రూ. 25 వేల చెక్కును ఆర్థిక సాయంగా అందించారు. వీరభద్రయ్యకు మెరుగైన వైద్యం, కనీస అవసరాలను తీర్చేలా ఈ సాయం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరభద్రయ్య కుటుంబానికి అండగా ఉంటానంటూ వారిలో ధైర్యం నింపారు. దాతృత్వం కొనసాగిస్తున్న ఆయనకు పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ట్రస్మా ప్రతినిధి బృందం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

అంబర్‌పేట: నూతనంగా ఎన్నికైన తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధి బృందం శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా స్కూల్ ఎడ్యుకేషన్-ఎన్ఐఓఎస్ ద్వారా ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్-స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌లను స్థాపించేందుకు ప్రైవేటు పాఠశాలలకు సబ్సిడీ రుణాలు అందించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేయాలని కేంద్ర మంత్రిని కోరుతూ ఓ వినతి పత్రం అందజేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లు, కోడింగ్, రోబోటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, ఎలక్ట్రికల్ తదితర స్కిల్స్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందని మంత్రికి వివరించారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ల ఏర్పాటు చేయడం ప్రైవేటు స్కూల్స్‌కు భారంగా మారిందని, ఇందు కోసం ప్రైవేటు స్కూల్స్‌కు కేంద్రం నుంచి తక్కువ వడ్డీతో సబ్సిడీ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. తనను కలిసిన ట్రస్మా నూతన కమిటీ సభ్యులను కేంద్ర మంత్రి శాలువాలతో సన్మానించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ట్రస్మా అధ్యక్షుడు మధుసూధన్, ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ రావు, కోశాధికారి పి.రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న తిరుమలకు మహా పాదయాత్ర

- గడప గడపకూ 'గీత, గోవిందుడు, గోవు'
- లక్ష్య సాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు

హిమాయత్‌నగర్: గడప గడపకూ 'గీత, గోవిందుడు, గోవు' అనే నినాదంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రం తిరుమలకు మహా పాదయాత్రను ప్రారంభించనున్నట్లు లక్ష్య సాధన ఫౌండేషన్ తెలిపింది. జనవరి 21న నగరంలోని కూకట్‌పల్లి నుంచి ఈ పాదయాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీమాన్ గట్టు అరుంధతి రంగాచార్యులతో కలిసి ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞారాజు పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 40 రోజుల పాటు, 40 గ్రామాలలో ప్రజలకు భగవద్గీతపై ఉన్న అపోహలను తొలగిస్తూ జ్ఞానాన్ని బోధించే గీత గొప్పదనాన్ని, హిందువులు పూజించే గోవు మహాత్యాన్ని తెలియజేస్తామన్నారు. ప్రతి ఊరిలో వెంకటేశ్వర స్వామి వారి కల్యాణం, ప్రసాద వితరణ కార్యక్రమాలు, యువత మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటాలని.. వాటి వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, వారికి మానవత్వం, మానవ విలువలను తెలియజేస్తామన్నారు. ప్రతి ఊరిలో నక్షత్ర వనం పేరుతో అడవులను పెంచాలన్నారు. మహాపాదయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీమాన్ బైలూర్ యోగీష్ ప్రభు, కళ్యాణ్ స్వామి, అచ్యుతరావు, తిరుపతిగారి ప్రభాకర్ జీ, శిల్పారెడ్డి, తనుశ్రీ, బడే సాబ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు